
జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

ఎడిటర్: చౌదరి, 9963063761



మంగళవారం | 29-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 796 పేజీలు: 4 వెల: రూ.7


## హైవేపై అనుమతుల్లేకుండా..

# షాపులు పెడితే సీజ్

* రహదారులపై భద్రతను పెంపొందించేందుకు ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ ఆఫీసర్
* మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారిపై లైంగిక నేరస్తుల షీట్లు
* సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు తీవ్రతరం
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి
* జిల్లా స్థాయి సమన్వయ సమావేశం



శ్రీకాకుళం, సెప్టెంబర్ 28 (వార్త): జాతీయ రహదారిపై అనుమతులు లేకుండా ఎటువంటి వ్యాపార సంస్థలు, హోటళ్ళు, దాబాలను నిర్వహించడానికి వీల్లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే తక్షణమే సీజ్ చేస్తామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం 'ఆపరేషన్ త్రిశూల్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ నోడల్ విభాగంగా, మహిళలు, పిల్లల భద్రతకు పోలీసు శాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తాయని స్పష్టం చేశారు. రహదారులపై భద్రతను పెంపొందించేందుకు ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించి, ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రానున్న రెండు వారాల్లో 12 రూర్బన్, 4 మున్సిపాలిటీలలో అధికారులంతా కలిసి క్షేత్రస్థాయిలో రోడ్డు భద్రతను స్వయంగా పరిశీలించాలని సూచించారు. ప్రాణాంతక ప్రమాదాలు జరిగిన వెంటనే మోటారు వాహన శాఖ, పోలీసు, రహదారుల భవనాల శాఖల అధికారులు ఉమ్మడిగా సంఘటనా స్థలాన్ని తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. బాధితులకు 'గోల్డెన్ అవర్'లో అత్యవసర వైద్యం అందించేందుకు కొత్త ట్రామా కేర్ సెంటర్లు, 19 నెట్‌వర్క్ ఆసుపత్రులు, అంబులెన్స్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని, ప్రైవేట్ పార్కింగ్ స్థలాలను గుర్తించి అనుమతులు ఇవ్వాలని వెల్లడించారు. మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడంతో పాటు మహిళలు, పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పోక్సో, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారిపై రౌడీ షీట్ల తరహాలో లైంగిక నేరస్తుల షీట్లు తెరిచామని పేర్కొన్నారు. స్కూళ్లు, కాలేజీలు, మార్కెట్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వంటి ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి పోలీసు నిఘాతో పాటు ఐసీడీఎస్, స్థానిక సంస్థల సమన్వయంతో రక్షణ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఫ్లైఓవర్ల కింద స్థలాలను శుభ్రం చేసి క్రీడా ప్రాంగణాలుగా మార్చడం, సీసీ కెమెరాలు, లైటింగ్ వసతులు కల్పించి మహిళలకు సురక్షిత వాతావరణం కల్పిస్తామని వెల్లడించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద రవాణా, అటవీ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు తీవ్రతరం చేయాలని, డ్రోన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్ సేవలను వాడాలని ఆదేశించారు. హైవేపై దాబాలు నడిపేవారు 'రాజమార్గ ప్రవేశ్' పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ప్రమాద సమయాల్లో వెంటనే అంబులెన్స్, క్రేన్ అందుబాటులో ఉంచే బాధ్యత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు తీసుకోవాలని నిర్దేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, ఆర్డీవో సాయి ప్రత్యూష, పలువురు డీఎస్పీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## భూ సమస్యలకు..

# శాశ్వత పరిష్కారం

* మార్చి నాటికి భూ సమస్యలు లేకుండా చూస్తాం
* రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో రీసర్వే
* అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నూతన పింఛన్
* పంట నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన
* విడతల వారీగా అర్హులైన వారికి పక్కా ఇళ్లు
* సంతబొమ్మాళి మండలం తనకు గుండెకాయ వంటిది
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
* సంతబొమ్మాళిలో రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాల పంపిణీ

సంతబొమ్మాళి, సెపెంబర్ 28 (వార్త): రైతుల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని, వచ్చే మార్చి నాటికి భూసమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం సంతబొమ్మాళి మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్.హెచ్.పురం, అంట్లవరం, గోదయ్యవలస, సీపురం, చిన్నతుంగం, కోటపాడు, మేఘవరం, కొల్లిపాడు, భావనపాడు గ్రామాల పరిధిలో రీ సర్వే పూర్తయిన 5,078 మంది రైతులకు రాజముద్ర, క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమక్షంలో దశలవారీగా రీ సర్వే నిర్వహించి, భూముల వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేస్తున్నామని తెలిపారు. రీ సర్వే అనంతరం భూ యాజమాన్య హక్కులను నిర్ధారిస్తూ ఆధునిక భద్రతా లక్షణాలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని భూసమస్యలను కూడా పరిష్కరించి రైతులకు భూ యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామాల్లో పట్టాదార్ పాస్ పుస్తకాలు, భూ రికార్డులు లేకపోవడంతో ఎవరి భూమి ఎవరిదో తెలియని పరిస్థితి ఉందని, ఆయా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో భూ రికార్డులను సరిచేసే ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. రీసర్వే సందర్భంగా తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా లేదా ఇతర కేటగిరీల్లో నమోదైన సందర్భాలు తమ దృష్టికి వచ్చాయని మంత్రి తెలిపారు. అటువంటి భూముల్లో ఎలాంటి అభ్యంతరాలు లేని వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న భూములను అసైన్మెంట్ కమిటీ ముందు ఉంచి పట్టాలు మంజూరు చేసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. అయితే చెరువు గర్భం, పోరంబోకు వంటి భూములకు చట్టపరమైన పరిమితులు ఉన్నాయని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా మాత్రమే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. భూ రికార్డుల పరిరక్షణకు బ్లాక్‌చైన్ సాంకేతికతను వినియోగించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. భూ రికార్డుల్లో అక్రమ మార్పులు, తారుమారుకు అవకాశం లేకుండా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని చెప్పారు. వెబ్‌ల్యాండ్‌లో అనధికారికంగా వివరాలు మార్చేందుకు ప్రయత్నిస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నూతన పింఛన్ల కోసం ప్రజల నుంచి వస్తున్న వినతులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 లక్షల నూతన పింఛన్ల కోసం దరఖాస్తులు అందాయని, వాటిని పరిశీలించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల మేరకు పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో ముంపునకు గురైన పంటపొలాల్లో నష్టాన్ని తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ చేయడంతో పాటు, పంటలను రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో నమోదు చేసి అంచనా వేస్తారని తెలిపారు. రైతులకు నష్టం జరగకుండా పారదర్శకంగా పంట నష్టం నమోదు, అంచనా ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. విడతలవారీగా ఇళ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉన్న అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన మంజూరులు చేసి పక్కా ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. సంతబొమ్మాళి మండలం తనకు గుండెకాయ వంటిదని మంత్రి అన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి, తహసీల్దార్ హేమసుందర్ రావు, ఎంపీడీవో పార్వతీశం, మండల వ్యవసాయ అధికారి అప్పారావు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# గొటివాడలో ప్రభుత్వ భూమి ఆక్రమణ

- కలెక్టర్‌కు ఫిర్యాదు
- సర్వే నంబర్ 69-3లో 30 సెంట్ల ప్రభుత్వ భూమిపై వివాదం
- అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాల పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి
- ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి, ఆక్రమణ యత్నాలపై చర్యలు తీసుకోవాలని కృష్ణదాస్ డిమాండ్



**జలుమూరు, సెప్టెంబరు 28 (వార్త):** గొటివాడ గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. గొటివాడ గ్రామకంఠంలోని సర్వే నంబర్ 69-3లో సుమారు 30 సెంట్ల స్థలంలో గత ప్రభుత్వ హయాంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం భవనాల నిర్మాణానికి పునాదులు, పిల్లర్లు నిర్మించి పనులు ప్రారంభించినట్లు కృష్ణదాస్ తెలిపారు. ఆయా నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.11 లక్షల నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్న నేపథ్యంలో కొంతమంది కూటమి నాయకులు భవనాల ప్రాంతాన్ని మట్టితో కప్పి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ఇతర ప్రయోజనాలకు వినియోగించకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంతో పాటు ఇప్పటికే ప్రారంభించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం భవనాల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ధర్మాన కృష్ణదాస్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నవిరి పోతయ్య, మాజీ ఎంపీటీసీ సోమినేని క్రిష్ణ, మెయ్యి సింహాచలం, బొన్న శ్రీనివాస్, దామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృభూమి ముద్దుబిడ్డ భగత్ సింగ్



**పాతపట్నం, సెప్టెంబరు 28(వార్త):** పాతపట్నంలోని ఆల్ ఆంధ్రా రోడ్లో గల మోడల్ ప్రైమరీ స్కూల్లో రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి కృష్ణారావు అధ్యక్షతన అమరవీరుడు షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి సి హెచ్ తిరుమలరావుతో కలిసి రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పారిశెల్లి రామరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరంలో భగత్ సింగ్ చేసిన త్యాగం చిరస్మరణీయమని, యువతలో దేశభక్తి, ధైర్యం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు భగత్ సింగ్ జీవితం స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ బాలమణి, బి రాజేశ్వరి, ఏ దాలయ్య, జే గాయత్రి, ఎం రమణ, ఎం ఢిల్లీశ్వరరావు, రామరాజు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొని అమరవీరుడు భగత్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించారు.

## ఈదుపురం మాజీ సర్పంచ్ దాలయ్య రెడ్డి మృతి





**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 28 (వార్త):** ఈదుపురం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, పూరి, గంజాం, శ్రీకాకుళం జిల్లా రెడ్డి మహాజన సభ ఈదుపురం గ్రూప్ అధ్యక్షులు, ఇచ్ఛాపురం నియోజకవర్గం మహతి సంస్కృతిక కళా సంస్థ గౌరవ సలహాదారులు తిప్పన దాలయ్య రెడ్డి ఆకస్మిక మృతి చెందారు. 1988-94 మధ్య కాలంలో ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎన్నికయ్యారు. మృతి పట్ల మాజీ జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ వి అర్ వో రాజారెడ్డి, రాష్ట్ర వైస్సార్సీపీ కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ లు సంతాపం తెలిపారు. నరేంద్ర పాడె మోస్తూ అంతిమ యాత్ర లో పాల్గొన్నారు.

## జ్ఞానభారతిలో డీ వార్మింగ్ మాత్రల పంపిణీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 28 (వార్త):** డీవార్మింగ్ డే సందర్భంగా జ్ఞానభారతి పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్య నిర్వహణ అధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో 9 వందల మంది విద్యార్థులకు మాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ ఐ బి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ , ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో హెచ్ ఎం సూర్యారావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

**సంతబొమ్మాళి, సెప్టెంబరు 28 (వార్త):** నౌపడ ఆర్యవైశ్య వీధి నుంచి లోపింటి వీధికి వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, పశువులకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి వేలాడుతున్న తీగలను సరిచేసి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





## పాతపట్నం-సరాళి రోడ్ పనులను పూర్తి చేయండి

- కలెక్టర్‌కు బీజేపీ నాయకులు వినతి

**పాతపట్నం, సెప్టెంబరు 28(వార్త):** పాతపట్నం - సరాళి రహదారి నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి పూర్తి చేయాలని స్థానిక బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ ను కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు సూచనల మేరకు సోమవారం పార్టీ నాయకుల బృందం శ్రీకాకుళంలోని ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికకు హాజరై జిల్లా కలెక్టర్‌ను కలసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. పాతపట్నం నుంచి చంగుడి, సరాళి మీదుగా మెళియాపుట్టి మండలంలోని మాకనాపల్లి జంక్షన్ వద్ద ఆల్ ఆంధ్రా రోడ్డును కలిపే ఈ రహదారి పనులను పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మొదలైన నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వి, మెటల్ వేసిన తర్వాత పనులను మధ్యలోనే వదిలేశారని వారు పేర్కొన్నారు. ఆరు నెలలు గడిచినా పనులు ముందుకు సాగకపోవడంతో రోడ్డు అధ్వానంగా తయారైందని, దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీరాజ్ శాఖ వద్ద నిధులు ఉంటే వెంటనే విడుదల చేయాలని, లేదా ఈ రహదారిని 'ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన' కిందకు తీసుకువచ్చి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రజల రవాణా కష్టాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులను ఆదేశించి, పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

## సచివాలయ ఉద్యోగుల అణచివేత అమానుషం

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**పాతపట్నం, సెప్టెంబరు 28 (వార్త):** గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు శాంతియుతంగా నిరసన తెలపడం నేరమా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా పోరాడుతున్న సచివాలయ ఉద్యోగులపై పోలీసుల లాఠీఛార్జ్, నిర్బంధాలను ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చంద్రబాబు మార్క్ 'రెడ్ బుక్ రాజ్యాంగం'తో ఉద్యోగుల గొంతు నొక్కుతోందని ఆరోపించారు. మహిళా ఉద్యోగులని కూడా చూడకుండా వారిని గాయపరచడం, రోడ్లపై ఈడ్చిపడేయడం అత్యంత అమానుషమని మండిపడ్డారు. ఉద్యోగులకు రావాల్సిన ఐఆర్ , పీఆర్సీ, డీఏలు, సరెండర్ లీవ్‌లు, బకాయిలు వంటి న్యాయమైన ప్రయోజనాలను చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి, అణచివేత ధోరణి ప్రదర్శించడం సరికాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు పరిపాలనను చేరువ చేసేందుకు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థను బలోపేతం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే కాకుండా, ఉద్యోగులపై అదనపు పనిభారం మోపుతూ తీవ్ర వేధింపులకు గురిచేస్తోందని ఆమె ధ్వజమెత్తారు. ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.

## విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

- విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొట్టపురుగుల నివారణ మాత్రల పంపిణీ
- సారవకోట పీహెచ్‌సీని పరిశీలించిన అదనపు డీఎంహెచ్‌వో

**సారవకోట, సెప్టెంబరు 28 (వార్త):** పిల్లల్లో రక్తహీనతను నివారించేందుకు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పలు చర్యలు చేపడుతున్నట్లు శ్రీకాకుళం అదనపు డీఎంహెచ్‌వో తాడేల శ్రీకాంత్ తెలిపారు. సోమవారం సారవకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడి వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యక్రమాల అమలు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో రక్తహీనత సమస్యను గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టేందుకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన అదనపు డీఎంహెచ్‌వో విద్యార్థుల ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థులకు పొట్టలోని పురుగుల నివారణ కోసం ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో మాత్రలు వేయించారు.

పిల్లల్లో రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించేందుకు చర్యలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.



## తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

-మత్స్యకార కుటుంబాలకు 50కిలోల బియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్యే శిరీష



**మందస, సెప్టెంబరు 28(వార్త):** ఇటీవల సంభవించిన తుఫాను ప్రభావంతో సముద్రంలో వేటకు వెళ్లలేక ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. మందస మండలంలోని దున్నవూరు పంచాయతీలో గల గెడ్డవూరు గ్రామంలో వేటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్న ప్రతీ మత్స్యకార కుటుంబానికి 50కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేసే సహాయ కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ సముద్ర వేటపైనే ఆధారపడి జీవించే మత్స్యకారులకు ఒక్క రోజు వేట బంద్ అయినా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాల కంటే ఏదీ ఎక్కువ కాదని, ప్రతికూల వాతావరణ సమయంలో మత్స్యకారులు తమ భద్రతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు. వేట నిలిచిపోయిన ఈ క్లిష్ట సమయంలో ఏ ఒక్క కుటుంబం నిత్యావసరాల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ బియ్యం పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. గెడ్డవూరు గ్రామంలోని మత్స్యకారుల సమస్యలపై అధికారులతో మాట్లాడి, వారికి కావాల్సిన మరిన్ని సహాయక చర్యలను సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. తుఫాను తగ్గుముఖంట్టిన తర్వాత కూడా వారి జీవనోపాధి పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో మందస తహసీల్దార్ బి.శ్రీహరి, తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, కార్యదర్శి సాలీన మాధవ రావు, నాయకులు లబ్బ రుద్రయ్య, దాసరి తాతారావు, చంద్రశేఖర్ ముంజేటి, నవీన్ యాదవ్, ఈశ్వరరావు అడ్డి, ఔగాన ఈశ్వరరావు, కుప్పిలి వెంకటరావులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రోగ్రెస్ లేని సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



**మందస, సెప్టెంబరు 28(వార్త):** ప్రభుత్వ మార్గదర్శలుకు అనుగుణంగా ప్రతీ గ్రామ సంఘం పరిధిలో నిర్దేశించిన పని విషయంలో ప్రోగ్రెస్ లేని, సకాలంలో స్పందించి మీటింగ్ లుకు హాజరుకాని సిబ్బంది కి ప్రత్యేక శ్రద్ధ వహించి శిక్షణ ఇవ్వడంతో పాటు వారు ప్రగతి సాధించేటట్లు సంబంధిత క్లస్టర్ కోఆర్డినేటర్లు ద్వారా సపోర్ట్ ను అందించి రివ్యూ మెకానిజం ను మెరుగు పరుస్తున్నట్లు మందస వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం గత రివ్యూ మీటింగ్ లకు హాజరు కాని వి.ఓ.ఏ. లకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన శిక్షణ ఇస్తూ ప్రత్యేకంగా రివ్యూ చేస్తూ ప్రోగ్రెస్ లో వెనుకబడడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అర్థం కాని సిబ్బంది కి మళ్ళీ మళ్ళీ అవగాహన కల్పిస్తూ, బాధ్యత లేని వారి స్థానంలో కొత్త వారిని గుర్తించే బాధ్యత గ్రామ, మండల సమాఖ్య ప్రతినిధులపై ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో అకౌంటెంట్లు కళ్యాణి, భాగ్యలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు మీనాక్షి, మంగమ్మ, ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

**మందస, సెప్టెంబరు 28(వార్త):** పలాస నియోజకవర్గం మందస మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే గౌతు శిరీష పర్యటించి పరామర్శలు చేపట్టారు. గెడ్డవూరులో వంక యాదవరావు, రట్టిలో పులారి దుర్యోధన, నాతుపురంలో మరణించిన పుచ్చ మీనాక్షి కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సువర్ణపురంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సాలీన భీమారావు పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే శిరీషా తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మండల కార్యదర్శి సాలీన మాధవరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# దశాబ్దాల రైతుబజార్ కల సాకారం

## పలాసలోని మూడు రోడ్ల జంక్షన్‌లో నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, సెప్టెంబరు 28 (వార్త):** పలాస--కాశీబుగ్గ పట్టణ ప్రజలు, రైతులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతు బజార్ కల సాకారం కానుంది. కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో నూతనంగా నిర్మించనున్న రైతు బజార్‌కు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం శంకుస్థాపన చేశారు. దీంతో స్థానిక రైతులకు తమ పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే వేదిక అందుబాటులోకి రానుంది. రైతులు పండించిన కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించుకునేలా రైతు బజార్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయం కల్పించడంతో పాటు పట్టణ ప్రజలకు నాణ్యమైన తాజా వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతు బజార్ నిర్మాణాన్ని పట్టణ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులు తమ ఉత్పత్తులను సౌకర్యవంతంగా విక్రయించుకునేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

### ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా..

రైతు బజార్ ఏర్పాటు స్థానికంగా చాలాకాలంగా ఉన్న డిమాండ్ అని, ఈ డిమాండ్‌ను నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టామని గౌతు శిరీష తెలిపారు. రైతులు, వినియోగదారులు ఇరువర్గాలకూ ప్రయోజనం కలిగేలా రైతు బజార్‌ను సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానికంగా పండే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ లభించడం ద్వారా రైతులకు విక్రయ అవకాశాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు తాజా ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రైతు బజార్ నిర్మాణానికి శంకుస్థాపన జరగడంతో రైతులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పలాస--కాశీబుగ్గ అభివృద్ధిలో ఇది మరో ముఖ్యమైన ముందడుగుగా వారు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, పలాస ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, వివిధ కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారులు, ఏఎంసీ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జలుమూరులో మండల స్థాయి పోటీలు



**జలుమూరు, సెప్టెంబరు 28 (వార్త):** జలుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలను చేపట్టినట్లు ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. క్విజ్ పోటీలో సాధారణ పరిజ్ఞానం, విద్యా సంబంధిత అంశాలపై విద్యార్థుల అవగాహనను పరీక్షించగా, వ్యాసరచనలో అంశాన్ని విశ్లేషించి చక్కగా వ్యక్తీకరించే నైపుణ్యాన్ని పరిశీలించారు. చిత్రలేఖనం పోటీలో విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తదుపరి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఎంఈఓలు వివరించారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకత, విషయ పరిజ్ఞానం, వ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందించేందుకు దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**జలుమూరు, సెప్టెంబరు 28 (వార్త):** లింగాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ విజయకుమారి పాల్గొని విద్యార్థులకు మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తోందన్నారు. మాత్రల వినియోగం ద్వారా కడుపులోని నులిపురుగులను నివారించి విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు మాత్రల వినియోగంపై అవగాహన కల్పించి, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకుందాం



**మెళియాపుట్టి, సెప్టెంబరు 28 (వార్త):** సేవ చేయటంలో భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్దామని బిజెపి పార్టీ నాయకులు డాక్టర్ సలాన శరత్ కుమార్ అన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో గల ఎస్డిఆర్ఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్ సింగ్ జయంతి వేడుకను సోమవారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ భారతావని గర్వించదగ్గ విప్లవ వీరుడు, అమరవీరుడు భగత్ సింగ్ అని స్వాతంత్ర సంగ్రామ సమయంలో ఆయన దేశానికి చేసిన సేవ త్యాగనిరతిని, దేశభక్తి కి నేటి యువతకు ఆదర్శమని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశ సేవలో ప్రతి ఒక్కరం భాగస్వామ్యం అవుదామని పిలుపు నిచ్చారు. అంతేకాకుండా విప్లవం వర్ధిల్లాలి అన్న నినాదాలు భారతదేశంలో ఎగ్రగించి స్వతంత్ర ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఈ మాత్రల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డాక్టర్ శరత్ కుమార్ తో పాటు కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, ఆదివాసి గిరిజన రాష్ట్ర నాయకులు చల్ల శాంతారావు, వైద్య సిబ్బంది, ఆశలు, విద్యార్థులున్నారు.






## డీ పట్టా భూములను తాకట్టు పెట్టి అక్రమ రుణాలా?

- అధికారుల సహకారంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- కలెక్టర్ గ్రీవెన్స్‌లో డీ పట్టాదారుల ఫిర్యాదు

**సంతబొమ్మాళి, సెప్టెంబరు 28 (వార్త):** వడ్డితాండ్ర రెవెన్యూ గ్రామ పరిధిలో దళితులు, బీసీలకు చెందిన డీ పట్టా భూములను అక్రమంగా తాకట్టు పెట్టి బినామీ వ్యక్తుల పేర్లతో రుణాలు మంజూరు చేయించారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెండ్ చేయాలని డీ పట్టాదారులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిషత్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు డీ పట్టాదారులు ఫిర్యాదు చేశారు. టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని దస్తావేజు నంబర్లు 2227/2004, 2382/2004, 1552/2005 ఆధారంగా ముగ్గురు వ్యక్తులు సుమారు రూ.11 లక్షల మేర అక్రమంగా రుణాలు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### నకిలీ పత్రాలతో భూముల తాకట్టు

ఫిర్యాదుదారుల వివరాల ప్రకారం సర్వే నంబర్లు 179-5లో 1.50 ఎకరాలు, 180-3లో 1.95 ఎకరాలు, 178-1లో 1.55 ఎకరాలు, 178-5లో 1.25 ఎకరాలు, 178-2లో 1.35 ఎకరాలు, 179-4లో 1.40 ఎకరాలు, 179-1లో 1.10 ఎకరాలు, 183-2లో 2.50 ఎకరాలు, 178-3లో 1.42 ఎకరాలు, 178-4లో 1.40 ఎకరాలు కలిపి మొత్తం సుమారు 15.82 ఎకరాల భూములకు సంబంధించిన వ్యవహారంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. భూములతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి ఈ భూములను తాకట్టు పెట్టి రుణాలు పొందినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, యూనియన్ బ్యాంక్ కళింగ రోడ్డు, శ్రీకాకుళం శాఖ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోటబొమ్మాళి శాఖల అధికారుల పాత్రపై కూడా విచారణ జరిపించాలని కోరారు.

### సమగ్ర విచారణకు డిమాండ్:

భూముల రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రుణ పత్రాలను సమగ్రంగా పరిశీలిస్తే అక్రమాలపై వాస్తవాలు వెలుగులోకి వస్తాయని డీ పట్టాదారులు పేర్కొన్నారు. అక్రమంగా రుణాలు పొందిన వ్యక్తులతో పాటు, ఈ వ్యవహారానికి సహకరించినట్లు తేలితే సంబంధిత అధికారులపైనా క్రిమినల్ కేసులు నమోదు చేసి, డీ పట్టాదారులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో సామ భాస్కరరావు, మునకాల కామమ్మ, వడ్డితాండ్ర రమణారావు, అనపాన కూర్మనాథ్, రాజాపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## చల్లవానిపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

- విద్యాబోధన, మౌలిక వసతులపై ఆరా తీసిన డిప్యూటీ డీఈఓ
- విద్యాశాఖ యాప్లను ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని సూచన
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన



**జలుమూరు, సెప్టెంబరు 28 (వార్త):** చల్లవానిపేట జడ్పీ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ విజయకుమారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న విద్యాబోధన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతుల పరిస్థితిని ప్రధానోపాధ్యాయురాలు నిర్మలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని, బోధనలో నాణ్యతను కొనసాగించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ సూచించారు. విద్యాశాఖకు సంబంధించిన యాప్లలో నమోదు చేయాల్సిన వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

భోజనం నాణ్యత, విద్యార్థులకు అందుతున్న ఆహారం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాలకు అనుగుణంగా పాఠశాలలో అన్ని ఏర్పాట్లు ఉండేలా చూడాలని పేర్కొన్నారు.

## రావిపాడులో ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం

- రూ.80 వేలతో లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్న దంపతులు
- విజేతలను అభినందించిన వేద పండితులు

**జలుమూరు, సెప్టెంబరు 28 (వార్త):** రావిపాడులో నిర్వహించిన వినాయక ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి నిమజ్జనోత్సవాన్ని గ్రామస్తులు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాల అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా స్వామివారికి సమర్పించిన లడ్డు ప్రసాదానికి గ్రామస్తులు వేలం నిర్వహించారు. వేలంలో స్థానిక గ్రామానికి చెందిన గోండు సూర్యనారాయణ, శ్రీదేవి దంపతులు ఉత్సాహంగా పాల్గొని రూ.80 వేలకు లడ్డు ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. వేలం సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది. వినాయక ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్న గోండు సూర్యనారాయణ, శ్రీదేవి దంపతులను వేద పండితులు బంకుపల్లి జగదీశ్ శర్మ, రామకృష్ణ అభినందించారు. ఉత్సవాల్లో భాగస్వాములైన భక్తులు, గ్రామస్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 28 (వార్త):** మెళియాపుట్టుగ కి చెందిన శివ కుమార్ తీవ్రమైన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. వైద్యులు సూచన మేరకు కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకోవాలని చెప్పారు. అత్యవసర ఆపరేషన్ అవసరం ఉంది. క్లిష్ట సమయంలోసహాయాన్ని కోరగా చిన్న సహాయంకొత్త జీవితం ఇవ్వగలదని ఆ కుటుంబానికి జి ఎస్ పౌండేషన్ నారాయణ,వేణు కలిపి ఆరు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

## గోవిందపుట్టుగ బీటీ రోడ్డు పనులకు మోక్షం




**కవిటి, సెప్టెంబరు 28 (వార్త):** సహాలాల పుట్టుగ పంచాయతీ గోవింద పుట్టుగ గ్రామానికి ఎట్టకేలకు బిటి రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించింది. ఈ మేరకు జగతి- సిలగాం రోడ్డు నుంచి గోవింద పుట్టుక వరకు ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ కృషితో 65 లక్షల రూపాయలు మంజూరు కాగా కవిటి పిఏసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్ సోమవారం కొబ్బరికాయ కొట్టి రోడ్డు చదును చేసే పనులు ప్రారంభించారు. ఎంతోకాలంగా ఈ ప్రాంత ప్రజలు ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్న ఈ రహదారికి మంచి రోజులు రానుండడంతో అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## అన్నప్రసాదానికి రూ.10 వేల వితరణ



**కంచిలి, సెప్టెంబర్ 28 (వార్త):** కంచిలి స్టేట్ బ్యాంకు వీధిలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా అన్నప్రసాద వితరణ చేపట్టేందుకు మాజీ పిఏసిఎస్ అధ్యక్షుడు, సీనియర్ వైసీపీ నేత గుమ్మడి రామదాసు సోమవారం 10 వేల రూపాయల సహాయాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ రామదాసును అభినందించారు.

## 1759 మంది మత్స్యకారులకు అర్నాబ్ సైక్లోన్ బియ్యం పంపిణీ

- ఒక్కో కుటుంబానికి 50కిలోలు అందజేత
- 87,950 కేజీల బియ్యం అందుకున్న లబ్ధిదారులు
- మందస తహసీల్దార్ బి.శ్రీహరిబాబు

**మందస, సెప్టెంబరు 28(వార్త):** ఆర్నాబ్ తుపానుతో చేపల వేటకు వెళ్లలేక ఇబ్బందులకు గురవుతున్న మత్స్యకారులకు బియ్యం పంపిణీ చేస్తున్నట్టు మందస తహసీల్ధార్ బి.శ్రీహరిబాబు చెప్పారు. ఇటీవల సంభవించిన అర్నాబ్ తుపాను మత్స్యకారులకు సముద్రంలోకి వెళ్లలేని పరిస్థితి తీసుకువచ్చిందని, దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి 50కిలోల వంతున బియ్యం మంజూరు చేసిందన్నారు. ఈ బియ్యాన్ని పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషా చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. మందస మండలంలోని మొత్తం 1750 మంది మత్స్యకార కుటుంబాలకు బియ్యం అందజేశామన్నారు. గెడ్డవూరులో 157 మంది మత్స్యకారులు, దున్నవూరులో 376, గంగువాడలో 595, బేతాళపురంలో 453, సిగలపుట్టుగలో 137, మందసలో 2, మందస 11, మందస 2, మందస 4, మందస 11, మందస 9, మందస 1, సిరిపురం ఒక కుటుంబంతో కలిపి మొత్తం 1759 కుటుంబాలకు 87,950 కేజీల బియ్యం అందజేశామన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్ధార్ బి.శ్రీహరిబాబు కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# తుఫాన్ నష్టంపై సమగ్ర అంచనా

## -శాఖల వారీగా క్షేత్రస్థాయి పరిశీలనకు ఎమ్మెల్యే శిరీష ఆదేశాలు



**పలాస, సెప్టెంబరు 28(వార్త):** తుఫాను ప్రభావంతో జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, బాధితులకు ప్రభుత్వ సహాయం త్వరితగతిన అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశించారు. గ్రామం, వార్డు, మండలం, శాఖల వారీగా నష్ట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు స్వయంగా పర్యటించి వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని, ప్రాథమిక నష్టం అంచనా, తుది అంచనా మధ్య వ్యత్యాసాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో నివేదికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నష్టం అంచనాలో పారదర్శకత పాటిస్తూ అర్హులైన ప్రతి బాధితుడికి ప్రభుత్వ నిబంధనల మేరకు సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతువారీగా పంట నష్టం నమోదు చేయాలని, వ్యవసాయ శాఖ అధికారులు వరి తదితర పంటలకు జరిగిన నష్టాన్ని రైతువారీగా నమోదు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పంట రకం, సాగు విస్తీర్ణం, నష్టం శాతం, ప్రభావిత రైతుల సంఖ్య వంటి వివరాలతో సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. అర్హత కలిగిన రైతులకు నిబంధనల మేరకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర ప్రభుత్వ సహాయం అందేలా ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఉద్యాన పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జీడి, కొబ్బరి, అరటి తదితర ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని ప్రత్యేకంగా అంచనా వేయాలని ఉద్యానవన శాఖను ఆదేశించారు. చెట్లు నేలకొరగడం, తోటలు దెబ్బతినడం, దిగుబడిపై ప్రభావం వంటి అంశాలను రైతువారీగా నమోదు చేసి అర్హులైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కాలువలు, చెరువులకు తక్షణ మరమ్మతులు చేపట్టి, నీటిపారుదల శాఖ పరిధిలోని కాలువలు, చెరువులు, గట్లు, డ్రైన్లు తదితర నిర్మాణాలకు జరిగిన నష్టాన్ని గుర్తించాలని ఆదేశించారు. గండ్లు పడిన, ప్రమాదకరంగా మారిన ప్రాంతాల్లో అత్యవసర మరమ్మతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్ వర్షాలతో మరింత నష్టం సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో దెబ్బతిన్న ప్రధాన రహదారులు, కల్వర్టులు, వంతెనలు, ప్రభుత్వ భవనాలను పరిశీలించి వివరాలు నమోదు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతులు వెంటనే చేపట్టి, శాశ్వత పునరుద్ధరణకు అవసరమైన అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు గ్రామీణ రహదారులు, సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రైన్లు, తాగునీటి వనరులు తదితర మౌలిక వసతులకు జరిగిన నష్టాన్ని గ్రామాల వారీగా నమోదు చేయాలని సూచించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఆదేశించారు. తుఫాను కారణంగా మత్స్యకారుల పడవలు, వలలు, ఇతర వేట పరికరాలు, చేపలు-రొయ్యల చెరువులకు జరిగిన నష్టాన్ని మత్స్యశాఖ అధికారులు అంచనా వేయాలని ఎమ్మెల్యే సూచించారు. బాధిత మత్స్యకారుల జాబితాను సిద్ధం చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సహాయం అందేలా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అన్ని శాఖల నుంచి అందిన నష్టం వివరాలను సమన్వయం చేసి సమగ్ర నివేదిక రూపొందించాల్సిన బాధ్యతను రెవెన్యూ యంత్రాంగం సమర్థంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇళ్లు, పశువులు, జీవనోపాధి, ఇతర ఆస్తులకు జరిగిన నష్టాన్ని కూడా నమోదు చేసి, అర్హులైన బాధితులకు ప్రభుత్వ సహాయం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిలిచిన గ్రామాలకు ప్రాధాన్యత ఇచ్చి పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలు, వంగిన స్తంభాల వల్ల ప్రజలకు ప్రమాదం జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

తుఫాను నష్టం కేవలం లెక్కలకే పరిమితం కాకుండా, బాధితులకు సహాయం అందించడం, దెబ్బతిన్న మౌలిక వసతులను పునరుద్ధరించడం, భవిష్యత్ విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా ముందస్తు చర్యలు చేపట్టడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు. శాఖల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయి పరిశీలన, వాస్తవ నష్టం నమోదు, వేగవంతమైన పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో చినబడాం విద్యార్థుల ప్రతిభ



**పలాస, సెప్టెంబరు 28 (వార్త):** శ్రీకాకుళంలో ఈ నెల 20న నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో చినబడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 14, 16 సంవత్సరాల విభాగాల్లో జరిగిన వివిధ అథ్లెటిక్స్ అంశాల్లో అత్యుత్తమ ప్రదర్శనతో పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. 60 మీటర్ల పరుగుపందెంలో కె. వాణి ద్వితీయ స్థానం సాధించగా, ట్రైథ్లాన్ విభాగంలో పి. యోగిత ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. డిస్కస్ త్రోలో ఎం. నిహారిక తృతీయ స్థానం సాధించి సత్తా చాటింది. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు సాధించిన ఈ విజయాలు పాఠశాలలో క్రీడా ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. విద్యార్థులకు క్రమం తప్పకుండా శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయురాలు టి. గీతను, విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చింతాడ ఉషారాణితో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులోనూ క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని పాఠశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## నులిపురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం



**సోంపేట, సెప్టెంబర్ 28 (వార్త):** నులిపురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని కొర్లాం పిహెచ్ సి వైద్య అధికారిని డాక్టర్ రోషిణి పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం నులిపురుగుల నివారణకు ప్రత్యేకంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మాత్రలు ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈ మందులు వాడడం ద్వారా శరీరంలో నులిపురుగులు నివారించబడి మంచి ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## నరసన్నపేటలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవ్



**నరసన్నపేట, సెప్టెంబరు 28 (వార్త):** నరసన్నపేటలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మహా, అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్దపేట బండి వీధి, కొత్తపేట, నక్కవీధి తదితర అంగన్వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ ఏ. రమణమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులు, తల్లులు, కుటుంబాలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న సేవలు, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణపై కార్యక్రమంలో వివరించారు. చిన్నారుల ఎదుగుదలకు సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు అవసరమని సిబ్బంది సూచించారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ పీవో అనురాధ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు గొల్లంగి పుణ్యవతి, కొర్ను పార్వతి, ఆశా వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సంతపేట అంగన్వాడీ కేంద్రాల్లోనూ సూపర్‌వైజర్ ఏ. రమణమ్మతో పాటు కింజరాపు రామారావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో భాగంగా పిల్లలు, తల్లులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొని పోషణ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించారు.

## గత పదేళ్లలో మున్సిపాలిటీలో అధ్వాన పాలన

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 28 (వార్త):** గత 10ఏళ్లలో మున్సిపాల్టీలో అద్వాన్నంగా పాలన సాగిందని పట్టణ తెలుగుదేశం నాయకులు అన్నారు. రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండున్నర ఏళ్లలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిన ఘనత కూటమి ప్రభుత్వనిది అని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు పత్రి తవితటయ్య అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా రూ19కోట్లు మంజూరు చేసి వర్చువల్ గా కార్యక్రమం ప్రారంబించారన్నారు. గొడ్డలి పార్టీకి చెందిన కొందరు అవగాహన లేని నాయకులు మున్సిపాల్టీతో సంబందం లేని వ్యక్తులు కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఖండిస్తున్నానమని అన్నారు. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయనిఅన్నారు. కూటమి ప్రభుత్వం ఈ రెండున్నరేళ్లలో సెంటర్ లైటింగ్ పూర్తి చేయటంతో పాటు ఆర యూబీలు మంజూరు చేసిందని, మున్సిపాల్టీ ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం రూ68కోట్లు ఏఐఐబీ ప్రాజెక్ట్ పనులు నిదులు మం జూరు చేసిందన్నారు. త్వరలోనే 28వార్డులు ప్రజలకు పూర్తిస్థాయిలో త్రాగునీరు అందుతుందన్నారు. త్వరలోనే శిధిలావస్థలో ఉన్న డైలీ మార్కెట్ను తొలగించి మోడల్ మార్కెట్ గా తీర్చుదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి నందిగాం కోటి, టీడీపీ నాయకులు కాళ్లదర్మారావు, ఆశి లీలారాణి, కాళ్ల దిలీప్, బి కృష్ణయ్య, జన్నెల సంతు, ఆసి దర్మరాజు, సాలిన జగదీష్ ,ఊనా సంతోష్,కోయిల రామారావు,చిడిపోతు పితాంబరు, జగన్, సుభాష్ కొరాయి దర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.



## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**పలాస, సెప్టెంబరు 28 (వార్త):** గురుదాసుపురం అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మహోత్సవం--అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళల్లో పోషకాహార లోపాల నివారణ, సమతుల ఆహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపాల కారణంగా పిల్లలు, మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత వివరించారు. శరీరానికి అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభించేలా రోజువారీ ఆహారంలో వివిధ రకాల పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు. స్థానికంగా సులభంగా లభించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను వినియోగించడం ద్వారా పోషకాహార లోపాలను చాలావరకు నివారించవచ్చని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు అందుబాటులో ఉన్న స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుటుంబ స్థాయిలోనే సమతుల ఆహారంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బాలికలకు పోషకాహారం అందించడంతోపాటు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేహెచ్‌పీటీ స్టేట్ కన్సల్టెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆహార పదార్థాలను బలవర్ధకం చేయడం వల్ల ప్రజలకు అదనపు పోషకాలు అందుతాయని వివరించారు. ముఖ్యంగా ఎఫ్ లోగోతో



గుర్తించబడే బలవర్ధక ఆహార పదార్థాలైన నూనె, బియ్యం, ఉప్పు, గోధుమపిండి, పాలు తదితరాలను వినియోగించడం ద్వారా శరీరానికి అవసరమైన సూక్ష్మ పోషకాలు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. పోషకాహార లోపాల వల్ల కలిగే అనర్థాలను నివారించేందుకు ప్రభుత్వం సూచించిన విధంగా ఫోర్టిఫైడ్ ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఆహారం విషయంలో పరిమాణంతోపాటు నాణ్యత, పోషక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పిల్లల ఎదుగుదల, ఆరోగ్యకరమైన శారీరక--మానసిక వికాసానికి సమతుల ఆహారం కీలకమని కార్యక్రమంలో వివరించారు. పోషకాహారంపై కుటుంబాల్లో అవగాహన పెంచుతూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను చిన్ననాటి నుంచే అలవర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలి



**పలాస, సెప్టెంబరు 28 (వార్త):** ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అన్యాయంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన వారి ఓటు హక్కును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2న పలాసలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయంలో సోమవారం వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ టి. సన్యాసిరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన పౌరుల పేర్లు తొలగిపోకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రధాన కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు రాజకీయ, ప్రజా సంఘాల నుంచి వస్తున్నాయని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేసి, ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలని కోరారు. ఈ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు తమ డిమాండ్లను ప్రభుత్వ, ఎన్నికల యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబర్ 2న నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ బస్టాండ్ వరకు ర్యాలీ సాగుతుందని, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్. గణపతి, ఎం. వినోద్‌కుమార్, మద్దిలి రామారావు, గోరు వాసు, కె. దుష్యంత్, కె. లోకనాథం, శివ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి రిత్వికా గోల్డ్ అధినేత దాతృత్వ హస్తం

### - గ్రౌండ్ టైల్స్ పనులకు రూ.1.20 లక్షలు

### -అన్నదాన పాత్రలకు రూ.20 వేల విరాళం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 28 (వార్త):** భక్తి, సేవా భావాలకు ప్రతీకగా నిలుస్తూ రిత్వికా గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దినేష్ కుమార్ పైడిశెట్టి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయాన్ని అందించారు.ఆలయంలో గ్రౌండ్ టైల్స్ పనుల కోసం లక్షా ఇరవై వేల రూపాయలు విరాళంగా అందించడంతో పాటు, భక్తులకు నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమాలకు అవసరమైన ఆహార వంట పాత్రల కోసం మరో 20 వేల రూపాయలు విరాళాన్ని అందించారు. ముత్యాలమ్మ ఆలయంలో ప్రతి సంక్రమణం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తూ భక్తులకు సేవలందిస్తోంది. ఈ పవిత్ర సేవా కార్యక్రమానికి దినేష్ కుమార్ పైడిశెట్టి అందించిన సహకారం మరింత బలాన్నిస్తుంది. ఆలయ అభివృద్ధికి విరాళం అందించడమే కాకుండా, భక్తులకు అన్నదానం చేసే మహత్తర కార్యక్రమానికి అండగా నిలవడం అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆయన అందించిన సహాయం ఆలయ అభివృద్ధికి, అన్నదాన సేవకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు."ఆలయానికి సేవ చేయడం.. అమ్మవారి భక్తులకు సేవ చేయడంతో సమానం" అనే స్ఫూర్తితో దినేష్ కుమార్ పైడిశెట్టి అందించిన ఈ విరాళం సేవాభావానికి చక్కని నిదర్శనంగా నిలిచింది. ఆయన దాతృత్వాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో కోయిల రామారావు, బి. కృష్ణయ్య, పైల నారాయణ రావు, లావేటి రామారావు, జోగి కోటి, రెడ్డి గోపాల్,ఇనుకోటి ఢిల్లీ రావు, బైరెడ్ల విజయ్,టెంక సోమేశ్,టెంక కుమారి మండల బాబు, పైల మాధవి రెడ్డి ఢిల్లీ,పైల లిఖిత, పైల హేమలత,పైల శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి గట్కా పోటీలకు 11 మంది విద్యార్థుల ఎంపిక



**నరసన్నపేట, సెప్టెంబరు 28 (వార్త):** కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గట్కా పోటీలకు నరసన్నపేట పీఎం శ్రీ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం రూపవతి తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. క్రీడల్లో విద్యార్థులు ఆసక్తి కనబరుస్తూ నిరంతరం సాధన చేయడం ద్వారా జిల్లా స్థాయిలో మంచి ప్రతిభను ప్రదర్శించారని హెచ్‌ఎం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సమర్థవంతంగా రాణించి పాఠశాలకు, నరసన్నపేటకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాలలో ఆనందం వ్యక్తమైంది. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరమణ, గణపతిరావు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## నులిపురుగుల నివారణపై అవగాహన



**పోలాకి, సెప్టెంబరు 28 (వార్త):** గంగివలస కేజీబీవీలో డీ-వార్మింగ్ డే సందర్భంగా సోమవారం విద్యార్థినులకు నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నులిపురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నల్లి రవికుమార్ పాల్గొని ఆల్బెండజోల్ మాత్రల పాత్ర, వాటి వినియోగం ద్వారా నులిపురుగుల సమస్యను నియంత్రించే విధానం గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండటం, పిల్లలను వ్యాధుల నుంచి రక్షించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వివరించారు. అలాగే పిల్లల ఆరోగ్య పరిరక్షణలో వ్యాధి నిరోధక యంత్రాంగం ప్రాధాన్యతను వివరించారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన సమయంలో వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. విద్యార్థినులు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా పలు అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది శేఖర్‌బాబు, మోహిని పాల్గొని విద్యార్థినులకు ఆరోగ్య సంబంధిత సూచనలు అందించారు. కార్యక్రమం ద్వారా నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కలిగించారు.

## బాలికలకు శక్తి టీమ్ అవగాహన

**నరసన్నపేట, సెప్టెంబరు 28 (వార్త):** తామరపల్లి గురుకుల పాఠశాలలో బాలికలకు మహిళల రక్షణ, చట్టాలు, వేధింపుల నుంచి రక్షణ పొందే మార్గాలపై శక్తి టీమ్ సభ్యులు ప్రభావతి, ధనలక్ష్మి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు తమ హక్కులు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శక్తి టీమ్ సభ్యులు సూచించారు. ముఖ్యంగా వివాహం అనంతరం ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వేధింపులు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు స్పందించి అవసరమైన సహాయం అందిస్తారని వివరించారు. బాలికలు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు మహిళలకు సంబంధించిన చట్టాలు, రక్షణ చర్యలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని శక్తి టీమ్ సభ్యులు సూచించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546